సాక్షి నిజామాబాద్

గురువారం । 20 । జూలై । 2023



ఆర్మూర్‌లో అక్కాచెల్లెళ్ల హత్య

ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్‌లో రాజవ్వ, గంగవ్వ అనే అక్కాచెల్లెళ్లను దుండగులు దారుణంగా హతమార్చారు.

- 8లో ▸



కేంద్రాలను పరిశీలించాలి

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
24.4 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. ఆహ్లాదకర గాలులు వీస్తాయి. జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా యాదిరెడ్డి బాధ్యతల స్వీకరణ



సుభాష్‌నగర్: జిల్లా అదనపు కలెక్టర్‌గా(రెవెన్యూ) యాదిరెడ్డి బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్‌గా ఉన్న చంద్రశేఖర్‌ను సంగారెడ్డి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ యాదిరెడ్డిని అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ఈమేరకు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి బుధవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యాదిరెడ్డిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, నాయకులు బోడ మహేందర్, కిష్టారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్, బోధన్ ఆర్డీవోలు రవి, రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- 08462–220183 నంబర్‌కు సమాచారమివ్వాలి : కలెక్టర్

సుభాష్‌నగర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 08462 – 220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూం నిరంతరం పని చేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలపవచ్చని పేర్కొన్నారు. సమాచారం అందించిన వెంటనే వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన ఇన్‌ఫ్లో

- 33,760 క్యూసెక్కుల వరద
- 34 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టులోకి 33,760 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 34 టీఎంసీలకు చేరుకుంది. ఒక్క రోజు వ్యవధిలో 3 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 359 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా బుధవారం రాత్రికి ప్రాజెక్టులో 1072.40 అడుగుల(34 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

బాలేగావ్ నుంచి నీటి విడుదల

ప్రాజెక్టు ఎగువన మహారాష్ట్రలో గల బాలేగావ్ బ్యారేజీ నుంచి దిగువకు 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నీరు ఎస్సారెస్పీకి గురువారం ఉదయానికి చేరుకుంటుందని అధికారులు తెలిపారు.



నవీపేట మండలం జన్నెపల్లిలో అలుగు పారుతున్న పెద్దచెరువు

ముసురు పట్టింది..

- ఎడతెరపి లేకుండా కురుస్తున్న వాన
- జిల్లాలో 55.4 మిల్లీమీటర్ల నగటు వర్షపాతం
- పొంగి పొర్లుతున్న చెక్‌డ్యాంలు, నిండుతున్న చెరువులు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

సుభాష్‌నగర్: జిల్లాకు ముసురుపట్టింది.. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. గడిచిన 24 గంటల్లో 55.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మోర్తాడ్‌లో పెద్ద వాగు, బోధన్‌లో మొండివాగు, సిరికొండ కప్పల వాగుతో పాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ధాటికి మాధవనగర్ ఆలయం వద్ద రోడ్డు తెగిపోయింది. చెక్‌డ్యాంలు, వంకలు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నగరంతోపాటు ఆర్మూర్, బోధన్, పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. నవీపేట్, రెంజల్, మోపాల్, మోస్రా, కోటగిరి, డొంకేశ్వర్, తదితర మండలాల్లో వర్షం అత్యధికంగా కురిసింది. నగరంతో పాటు మున్సిపాలిటీల్లో వర్షం కురుస్తుండడంతో ప్రజలు రోడ్లపైకి రాలేకపోయారు. అత్యవసర పనులు ఉన్న వారే బయటకు వచ్చారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం ఏకధాటిగా కురవడంతో చెక్‌డ్యాంలు, వాగులు, వంకలు, ఒర్రెల్లో నీరు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పొలాల గట్లపై నుంచి నీరు ప్రవహిస్తోంది.

11 మండలాల్లో అధిక వర్షపాతం

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. 21 మండలాల్లో సాధారణ వర్షపాతం, నిజామాబాద్ సౌత్ మండలంలో లోటు వర్షపాతం నమోదైంది. సీజన్ ప్రారంభమైన జూన్ 1 నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 10,115 మిల్లీమీటర్లు కాగా, అందులో బుధవారం ఒక్కరోజే 1827.8 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. రానున్న రెండు రోజులు కూడా జిల్లాకు భారీ వర్షసూచన ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ.)	మండలం	వర్షపాతం
		నిజామాబాద్‌నార్త్	55.9
నవీపేట	80.3	ఏర్గట్ల	43.9
నందిపేట	49.2	నిజామాబాద్‌రూరల్	61.7
వర్ని	54.9	సిరికొండ	54.1
డొంకేశ్వర్	64.5	ఇందల్వాయి	71.4
మాక్లూర్	59.5	ఎడపల్లి	53.3
కోటగిరి	65.4	మోస్రా	71.2
రెంజల్	72.9	సాలూర	63.0
పోతంగల్	55.3	ముప్కాల్	44.7
బోధన్	59.0	రుద్రూరు	50.7
డిచ్‌పల్లి	59.0	ఆర్మూర్	47.1
బాల్కొండ	58.6	ధర్పల్లి	52.5
మెండోరా	48.0	భీమ్‌గల్	42.5
వేల్పూర్	38.3	మోపాల్	65.0
చందూరు	58.8	జక్రాన్‌పల్లి	48.1
ఆలూరు	58.5	కమ్మర్‌పల్లి	35.7
మోర్తాడ్	36.8	నిజామాబాద్‌సౌత్	48.0

గోదావరికి వరద ఉధృతి

రెంజల్(బోధన్): జిల్లాకు ఎగువన మహారాష్ట్రతో పాటు స్థానికంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మొన్నటి వరకు బోసిపోయిన గోదావరి బుధవారం నుంచి నిండుగా ప్రవహిస్తోంది. స్థానిక వాగులు, వంకలతో పాటు మంజీర, హరిద్ర నదుల నుంచి వరద నీరు వచ్చి కందకుర్తి వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో నదిలో వరద ఉధృతి బాగా పెరిగింది. ప్రస్తుతం నదిలోని పురాతన శివాలయం వరద నీరు చేరుకుంది.



ముప్కాల్ శివారులో పొలాల్లోకి చేరిన వరద నీరు



మాధవనగర్ రైల్వే గేటు వద్ద వరద ప్రవాహానికి తెగిన రోడ్డు



గోదావరి నదిలో కందకుర్తి వద్ద శివాలయం వరకు చేరిన వరద నీరు

నగరంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



నగరంలోని జోన్‌-3 కార్యాలయ పరిధిలో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మకరందు

- జోన్ –3 కార్యాలయం పరిశీలన

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మంద మకరందు నగరంలో బుధవారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఉదయం 5 గంటల నుంచే తనిఖీలు చేపట్టారు. పెద్దబజార్ వాటర్ ట్యాంకు ప్రాంతంలో ఉన్న జోన్‌-3 కార్యాలయాన్ని పరిశీలించారు. సుమారు గంటన్నర పాటు జోన పరిధిలోని పలు డివిజన్లలో తిరిగి సానిటేషన్‌ను పరిశీలించారు. కార్మికులతో మాట్లాడారు. సానిటేషన్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు బాధ్యతగా అందుబాటులో ఉండి సక్రమంగా శానిటేషన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అలీం, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీ, ఆర్‌వో నరేందర్, జోన్ క్లసర్ ఆఫీసర్ శ్రీకాంత్, కార్పొరేటర్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి వరద నీటి ఇబ్బందులు

నగరంలో ముంపు ప్రాంతాల్లో, శివారు కాలనీల్లో వరదనీరు నిలువ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు సయ్యద్ ఖైసర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై కమిషనర్ ఖైసర్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఇక్కట్లు లేకుండా సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిగా వాజిద్ హుస్సేన్



వాజిద్ హుస్సేన్

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయాధికారిగా వాజిద్ హుస్సేన్ నియామకం అయ్యారు. శాఖలోనే ఏడీఏగా పనిచేస్తున్న వాజిద్‌కు డీఏవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు డీఏవోగా పని చేసిన తిరుమల ప్రసాద్ తమకొద్దని ఏఈవోలు, ఏవోలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుమల ప్రసాద్‌ను డీఏవో పోస్టు నుంచి తప్పించారు. ప్రస్తుతం రైతు శిక్షణ కేంద్రానికి డీడీఏగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక నుంచి జిల్లా వ్యవసాయాధికారిగా వాజిద్ హుస్సేన్ కొనసాగనున్నారు.

బాలలపై లైంగిక దాడులను నివారిద్దాం

- పోక్సో చట్టంపై లఘు చిత్రం
- బాధితులకు న్యాయసేవా సంస్థ ద్వారా పరిహారం
- జిల్లా జడ్జి సునీత కుంచాల



మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: బాలలపై లైంగిక వేధింపులు, దాడులు నిరోధించడానికి వీలుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నదని సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. పోక్సోచట్టంపై లఘుచిత్రం చిత్రీకరణ సందర్భంగా జిల్లాకోర్టు ఆవరణలోని న్యాయసేవ సదన్‌లో ఆమె సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సలహాదారు సాయిప్రసాద్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో పోక్సో చట్టంపై విస్తృత అవగాహన కల్పించడానికి దృశ్యమాధ్యమ లఘుచిత్రం చిత్రీకరణ జరుగుతుందని వివరించారు. 18 ఏళ్ల లోపు బాలల పురోభివద్ధికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం తోడ్పాటు, సహకారం అందించాలని ఆమె కోరారు. నేటి ఆధునిక యుగంలో స్మార్ట్ ఫోన్లు విరివిగా వినియోగిస్తున్నారని వాటిలో లఘుచిత్రం ప్రసారం వలన ప్రజల్లో పోక్సోచట్టంపై చైతన్యం కలుగుతుందన్నారు. సినిమా థియేటర్లు, లోకల్ చానళ్లలో కూడా లఘు చిత్రం ప్రసారం చేయడానికి ప్రణాళికలు ఉన్నాయన్నారు. బాలలపై జరుగుతున్న లైంగిక హింసకు సంబంధించిన క్రిమినల్ కేసులను విచారించడానికి జిల్లాకోర్టు ప్రాంగణంలో ప్రత్యేక పోక్సో కోర్టు తన విధులను నిర్వహిస్తున్న విషయం జిల్లా ప్రజలకు ఎరుకనేనని ఆమె గుర్తుచేశారు. న్యాయ విచారణకు హాజరయ్యే బాధితులకు ప్రత్యేక వసతి సౌకర్యాలు ఉన్నాయని ఒక స్నేహపూర్వక వాతావరణంలో నేరన్యాయ విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు న్యాయసేవా సంస్థ తగిన పరిహారం అందిస్తుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, న్యాయసేవ సంస్థ న్యాయవాదులు జగన్ మోహన్ గౌడ్, మానిక్ రాజు, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

268 మంది టీచర్ల సర్దుబాటు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత తీర్చేందుకు జిల్లా విద్యాశాఖ టీచర్ల సర్దుబాటు ప్రక్రియను చేపట్టింది. నెల రోజులుగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉండడం, టీచర్లు ఎక్కువగా ఉండి విద్యార్థులు తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. ఆయ ప్రాంతాల్లో ఈ సర్దుబాటు ప్రక్రియ కొనసాగించారు. విద్యార్థులు ఎక్కువగా ఉండి.. ఖాళీలు ఎక్కువ ఉన్నచోట అవసరమైన టీచర్లను అక్కడికి సర్దుబాటు చేశారు. మొదట మండల పరిధిలో ఈ సర్దుబాటు ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చారు. అనంతరం ఆ మండలంలో సంబంధిత టీచర్లు లేకపోవడం లేదా సరిపోకపోతే ఇతర మండలాల నుంచి టీచర్లను ఆయా ప్రాంతాలకు సర్దుబాటు చేశారు. ఇలా 268 మంది టీచర్లను సర్దుబాటు చేశారు. వీరికి నేడు లేదా రేపు సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

మండలాల వారీగా సర్దుబాటు చేసిన టీచర్ల సంఖ్య

మండలం	టీచర్ల సంఖ్య	మండలం	టీచర్ల సంఖ్య
		మోర్తాడ్	08
		మెండోరా	07
బోధన్	33	ఇందల్వాయి	07
డిచ్‌పల్లి	22	రెంజల్	08
మాక్లూర్	20	ఎడపల్లి	06
ఆర్మూర్	17	రూరల్	06
జక్రాన్‌పల్లి	13	పోతంగల్	05
నందిపేట	13	ధర్పల్లి	03
రుద్రూర్	13	మోస్రా	04
సిరికొండ	12	ముప్కాల్	04
భీమ్‌గల్	13	చందూరు	03
వర్ని	11	మోపాల్	03
కమ్మర్‌పల్లి	11	నిజామాబాద్‌సౌత్	03
వేల్పూర్	10	నిజామాబాద్‌నార్త్	02
నవీపేట	09	ఏర్గట్ల	02

ఆడిటర్ కం డిక్టేటర్!

- ఐకేపీలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ అధికారి
- పుస్తకాల నిర్వహణలో లోపాలను అవకాశంగా మార్చుకుంటున్న వైనం
- నలిగిపోతున్న వీవోఏలు, సీసీలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందినా సదరు అధికారిపై చర్యలు శూన్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఆడిటింగ్ విభాగం అవినీతిమయంగా మారింది. వ్యవస్థలో తప్పులను సరిదిద్దాల్సిన అధికారులే అక్రమాలకు పాల్పడుతున్నారు. లోపాలను ఎత్తి చూపి వాటిని బయటకు రానివ్వకుండా 'ముడుపులు' అందుకుంటున్నారు. ఇవ్వకపోతే బయపెట్టి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందులో ప్రధానంగా ఓ ఆడిట్ అధికారి(సీబీవో) పేరు గట్టిగా వినిపిస్తోంది. ఎంతలా అంటే శాఖతో పాటు అందులోని అధికారులను శాసించే స్థాయికి చేరాడు. నియంతలా మారి అందినకాడికి దండుకోవడమే పరమావధిగా పని చేస్తున్నాడని శాఖలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉన్నతాధికారుల అండదండలతో బదిలీ కాకుండా ఏళ్లకు ఏళ్లు ఒకే చోట తిష్ట వేయడంతో అక్రమాలకు పాల్పడే విషయంలో అరితేరాడని తీవ్ర విమర్శలు సైతం వస్తు న్నాయి. ఆడిటర్ ఉద్యోగంతో ఐకేపీ సిబ్బందిని బలవంతపెట్టి 'చిట్టీల' దందాను నడిపిస్తున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. 'నేనింతే'.. 'నన్నేం చేయలేరు' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడని, ఆయనతో వేగలేకపోతున్నామని బాధిత వీవోఏలు, సీసీ లు ఉన్నతాధికారులకు అంతర్గతంగా చాలాసార్లు మొరపెట్టుకున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసు కోవడానికి వారు మీనమేషాలు లెక్కించడం గమనార్హం.

ఫోన్‌పే, గూగుల్‌పే, దావత్‌లు..

ఐకేపీ శాఖ ద్వారా ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందిస్తోంది. అయితే, రుణాలందించడానికి క్షేత్రస్థాయిలో వీవోఏలు కీలకంగా పనిచేస్తారు. మహిళా సంఘాల పుస్తకాల నిర్వహణ, రికార్డులు రాయడం అంతా వీరే చూస్తారు. పుస్తకాల్లో రాసిన రికార్డులు సక్రమంగా ఉన్నాయో లేదో చూసేందుకు ప్రతి ఆర్నెళ్లు, ఏడాదికోసారి ఆడిటింగ్ చేస్తారు. ఏమైనా లోపాలు బయటపడితే ఆడిట్ రికార్డుల్లో రాయాల్సిన బాధ్యత ఆడిటింగ్ అధికారులదే. కానీ, ఆరేడు మండలాలకు కలిపి ఆడిటర్‌గా పనిచేస్తున్న ఒక అధికారి అక్రమాలకు తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ఆడిట్ వ్యవస్థను తనకు అనుకూలంగా చేసుకుని లోపాలతో వీవోఏల దగ్గర వసూళ్లకు పాల్పడినట్లు, ఇంకా పాల్పడుతున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఒక గ్రామ సమాఖ్య నుంచి రూ. 2లక్షలు అప్పుగా తీసుకున్న విషయాన్ని ఆడిట్‌లో చూపకుండా ఉండేందుకు సదరు వీవోఏ నుంచి రూ. లక్ష వరకు వసూలు చేసినట్లు తెలిసింది. లెక్కలు రాయలేదని మరో వీవోఏ వద్ద రూ. వేలల్లో దండుకున్నట్లు సమాచారం. వసూళ్లు చేసే క్రమంలో లిక్విడ్ క్యాష్ లేకున్నా పర్వాలేదని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆడిట్‌లో అభ్యంతరం తెలుపకుండా తన వద్ద చిట్టీ వేయాలని బ్లాక్‌మెయిల్ కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే కాకుండా తాను టూర్లకు వెళితే కూడా డబ్బులు ఆశిస్తాడని, అధికారులకు తెలిసినా వారిని మచ్చిక చేసుకునేందుకు దావత్‌లు ఇచ్చి మేనేజ్ చేస్తారనే పేరు కూడా ఉంది. 'ఆడిటర్' బాధితుల్లో సీసీలు కూడా ఉన్నారని, వారిని చులకన చేసి మాట్లాడతారనే ఆరోపణలున్నాయి. ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న సదరు ఆడిటర్‌ను బదిలీ చేయడమో, చర్యలు తీసుకోవడమో ఏదో ఒకటి చేయాలని ఐకేపీ శాఖకు చెందిన బాధిత ఉద్యోగులు కొందరు కోరుతున్నారు.



ఒకసారి హెచ్చరించా..

మహిళా సంఘాల పుస్తకాలను ఆడిట్ చేసే అధికారుల్లో ఒక ఆడిటర్‌పై గతంలో ఆరోపణలు వచ్చాయి. సదరు అధికారిని పిలిచి హెచ్చరించా. బాధిత ఉద్యోగులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. – చందర్ నాయక్, డీఆర్‌డీవో, నిజామాబాద్

క్లుప్తంగా

పీజీ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఐఎంబీఏ, ఏపీఈ, పీసీహెచ్ (ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు), ఎల్‌ఎల్‌బీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 49 మంది విద్యార్థులకు 49 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.

25 నుంచి ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ 1వ, 3వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు జూలై 25 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు బెస్ట్ అవైలబుల్ స్కీం లక్కీ డ్రా

నిజామాబాద్‌అర్బన్: బెస్ట్ అవైలబుల్ స్కీంలో ప్రవేశాలకు సంబంధించిన లక్కీ డ్రాను గురువారం నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శశికళ ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి, ఐదో తరగతిలో ప్రవేశాల కోసం స్వీకరించిన దరఖాస్తులకు లక్కీ డ్రా చేపడుతున్నట్లు చెప్పారు. ఉదయం 10.30కు ఒకటో తరగతి, మధ్యాహ్నం 12 గంటలకు ఐదో తరగతి వారికి కలెక్టరేటు ప్రజావాణి సమావేశపు హాల్ డ్రా ఉంటుందన్నారు.

నాణ్యమైన సేవలే లక్ష్యం



బోధన్‌రూరల్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి విద్యుత్ సంస్థను లాభాల్లో నడిపించడమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం సాలూర సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కరెంట్ సప్లయ్‌లో అంతరాయం, మీటర్ రీడింగ్‌లో ఇబ్బందులు, బిల్లులు ఎక్కువ రావడం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో జాప్యం వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ వేదికలు ఉపయోగపడతాయన్నారు. వినియోగదారుల నుంచి 10 వినతులు సేకరించామన్నారు. టెక్నికల్ మెంబర్ అశోక్, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ భూమారెడ్డి, బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్, ఏడీఈ బెనర్జీ, ఏఈ కళ్యాణ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్‌నాగారం: వర్షాలు కురుస్తున్నందునా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో విధిగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘ సమావేశంలో విద్య, వైద్యంపై ఆయన సమీక్షించారు. మలేరియా, డెంగీ ఇతర వ్యాధుల బారిన పడిన వారికి అత్యవసరంగా చికిత్స అందే విధంగా చూడాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిపై నియంత్రణ ఉంచాలన్నారు. జెడ్పీ సీఈవో గోవింద్, జెడ్పీటీసీలు సుమనరెడ్డి, భారతి, మహిళా శిశు కమిటీ చైర్‌పర్సన్ దాసరి లావణ్య, డీఎంహెచ్‌వో సుదర్శనం, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఆయుష్ జిల్లా అధికారి రామ్మోహన్, ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ఇన్‌ఫ్లో వస్తోంది. బుధవారం ఉదయం 1,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సాయంత్రానికి 1,700 క్యూసెక్కులకు చేరింది. రాత్రి 9 గంటల ప్రాంతంలో 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. 1,388.45 అడుగుల(3.490 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

స్కీం ప్రైజ్‌లు వచ్చాయా?

- లక్కీ డ్రా స్కీంలలో సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్
- స్కీం బహుమతులు 15 రోజుల్లో చెల్లించాలని ఆదేశించిన మంత్రి
- నిర్వాహకులు స్పందిస్తున్నారా అని క్రాస్ చెక్ చేస్తున్నారనే భావన



మోర్తాడ్: 'హలో మీరు ఫలానా స్కీంలో చేరి ప్రతి నెలా డబ్బులు చెల్లించారు కదా నిర్వాహకులు బహుమతి గానీ సొమ్ము ఏమైనా వాపసు చేశారా'.. అంటూ గుర్తు తెలియని వ్యక్తులు స్కీంలలో సభ్యులుగా చేరిన వారికి ఫోన్‌లు చేసి సమాచారం సేకరిస్తున్నారు. స్కీం నిర్వాహకులలో ఎక్కువ మంది అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారు ఉండటంతో లక్కీ డ్రా నిషేధమైనా పోలీసులు ఎదురు చెప్పలేకపోయారు. ఇదే అవకాశంగా భావించిన కొందరు అక్రమార్కులు స్కీంల డబ్బులను తమ సొంతానికి వాడుకుని సభ్యులకు బహుమతులు ఇవ్వకపోవడం, వారి నుంచి తప్పించుకు తిరగడం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులే స్కీంల నిర్వాహకులుగా వ్యవహరిస్తుండటంతో అధికార పక్షం చూసి చూడనట్లు వ్యవహరించిందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'స్కీంల పేరుతో స్కాం' అనే శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనంతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్పందించి స్కీం డబ్బులు లేదా బహుమతులను సభ్యులకు అందించాలని ఆదేశించారు. 15 రోజుల్లో సమస్య పరిష్కారం కావాలని సూచించారు. ఇదే తరుణంలో వివిధ గ్రామాలలో ఉన్న సభ్యులకు కొత్త కొత్త నంబర్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. స్కీం డబ్బులు వాపసు వచ్చాయా, ఎంత చెల్లించారు మీకు ఎంత వాపసు వచ్చింది, లేదా బహుమతులు ఇచ్చారా అనే విషయాలను ఫోన్‌లు చేసిన వారు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. స్కీం నిర్వాహకులకు మంత్రి అల్టిమేటం ఇవ్వడంతో అధికార పక్షమే ముందు జాగ్రత్తగా స్కీం సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తుందా అనే సందేహం వ్యక్తమైతుంది. ఇది ఇలా ఉండగా గడువులోగా సభ్యులకు న్యాయం జరుగకపోతే అధికార బీఆర్‌ఎస్‌ను ఇబ్బంది పెట్టడానికే ప్రతిపక్ష పార్టీల నాయకులే స్కీం సభ్యులకు ఫోన్‌లు చేస్తున్నారా అనే అనుమానం తలెత్తుతుంది. వీలైనంత తొందరగా స్కీంల సమస్యను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ అధిష్టానం భావిస్తే గడువు తీరేలోగా సభ్యులకు న్యాయం జరగకపోతే ఆందోళనలు చేయాలని ఇతర పార్టీల నాయకులు ఆలోచిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గాల వారీగా అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల తుది జాబితాను సిద్ధం చేసి ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉన్నందున, అన్ని పోలింగ్ స్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మార్పులు, కొత్త కేంద్రాల ఏర్పాటు అవసరాన్ని గుర్తిస్తే వెంటనే ఈఆర్‌వోలకు ప్రతిపాదనలు సమర్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాల పేర్లలో ఏవైనా మార్పులు చేయాల్సి ఉన్నా, అక్షర దోషాలు సవరించాల్సి ఉంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. కొత్తగా ఏర్పడిన మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల పేర్లలో మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉన్నందున, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత ఈఆర్‌వోలను ఆదేశించారు. అలాగే పురాతన కాలం నాటి, శిథిలావస్థకు చేరిన భవనాల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాల మార్పు, 1,400 పైచిలుకు ఓటర్లు కలిగిన పోలింగ్ స్టేషన్ల పరిధిలో కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు, తదితర అంశాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. నివాస ప్రాంతానికి ఎక్కువ దూరంలో ఉండే పోలింగ్ కేంద్రాలను సైతం గుర్తించి ప్రతిపాదనలు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. కాగా ఓటర్ల జాబితా పక్కాగా రూపొందేలా రాజకీయ పక్షాలు తమవంతు సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, ఆర్డీవోలు రవికుమార్, రాజేశ్వర్, వినోద్ కుమార్, తహసీల్దార్లు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కమాండెంట్ సత్యశ్రీనివాసరావు బదిలీ





కమాండెంట్ దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది, కమాండెంట్ వాహనాన్ని తాళ్లతో లాగుతున్న సిబ్బంది

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్ ఎన్‌వీ సత్యశ్రీనివాసరావు నల్గొండ జిల్లా అన్నెపర్తి 12వ బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. 2020 నుంచి ఆయన ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్నారు. బుధవారం కమాండెంట్ సత్యశ్రీనివాసరావు, ఆయన సతీమణి రజినిని అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం వాహనంపై కమాండెంట్‌ను ఉంచి సిబ్బంది తాళ్లతో లాగి వీడ్కోలు పలికారు. అసిస్టెంట్ కమాండెంట్స్ ఎం వెంకటేశ్వర్లు, సి ఆంజనేయరెడ్డి, భాస్కర్‌రావు, ఏవో హంసరాణి, యూనిట్ హాస్పిటల్ డాక్టర్ ఎస్ అనుపమ పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్‌గా రాంప్రకాశ్



రాంప్రకాశ్

డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా బి రాంప్రకాశ్ నియామకమయ్యారు. రాంప్రకాశ్ జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి పదో బెటాలియన్ నుంచి ఇక్కడకు వస్తున్నారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

21న ఉద్యోగ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 21న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌లోని వరుణ్ మోటార్స్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, సర్వీసెస్ అడ్వైజర్స్/టెక్నిషియన్స్ ఉద్యోగాలున్నాయి. విద్యార్హత ఎంబీఏ/డిగ్రీ/ఐటీఐ/డిప్లొమా. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయానికి రావాలని, ఇతర వివరాలకు 6305743423,9959456793, 9581768413 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అరెస్టు వారెంటు జారీ చేసిన కోర్టు

బిచ్కుంద: హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన నల్లపనేని అంజిబాబుపై బిచ్కుంద కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గతంలో బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో అంజిరెడ్డిపై కేసు నమోదైంది. నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

వర్షానికి కూలిన ఇళ్లు



ఎడపల్లి: వర్షానికి మండలంలోని జానకంపేటలో బుధవారం రెండు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన సిరిప లింగం, గంగమణి ఇళ్లు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి కూలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నేలకూలిన ఇళ్లను ఆర్‌ఐ వినోద్, ఎంపీటీసీ సంజీవ్, కార్యదర్శి ప్రేమ్‌దాస్, ఉప సర్పంచ్ విజయ్‌కుమార్ పరిశీలించారు.

బాల్కొండ: బాల్కొండకు చెందిన ఎడపల్లి లక్ష్మి ఇల్లు వర్షాలకు కూలింది. పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి కూలిన ఇంటిని పరిశీలించారు. అనంతరం ఆమెకు మున్నూరు కాపు సంఘం ఇంట్లో బస ఏర్పాటు చేశారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్యారం పోటీలు



విజేతగా నిలిచిన విద్యుత్ సౌధ జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎస్‌ఈ రవీందర్



తృతీయ స్థానంలో నిలిచిన నిజామాబాద్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఈ

నిజామాబాద్‌నాగారం: నగరంలో రెండు రోజులుగా జరుగుతున్న విద్యుత్ ఉద్యోగుల క్యారం పోటీలు బుధవారం ముగిశాయి. జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు పోలీస్ పరేడ్ మైదానంలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఈ రవీందర్ హాజరై మాట్లాడారు. 24 గంటల పాటు విధుల్లో ఉండే ఉద్యోగులు మానసిక ఉల్లాసానికి పోటీలు ఉత్సాహాన్నిస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సూర్యనరసింహారావు, తోట రాజశేఖర్, గంగారాం నాయక్, సురేష్, డీఈలు రాజేశ్వర్‌రావు, వెంకటరమణ, ఉత్తమ్ పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు

క్యారం సింగిల్‌లో ద్వారక(వరంగల్ ఓఎంసీ), ఎండీ ఇలియాస్(నిజామాబాద్), జాకీర్ (విద్యుత్ సౌధ) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో ఖలీల్, జాకీర్(విద్యుత్ సౌధ), ద్వారక, శ్రీనివాస్‌రెడ్డి(వరంగల్ ఓఎంసీ), శంకర్, రాజశేఖర్(నిజామాబాద్), రాకేష్, ప్రతాప్(విద్యుత్ సౌధ)ఉన్నారు. ఓవరాల్‌గా విద్యుత్ సౌధ జట్టు గెలుపొందగా, వరంగల్ రెండో స్థానంలో, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి.

నటేశ్వరశర్మకు 'దాశరథి' అవార్డు



నటేశ్వరశర్మ

కామారెడ్డి అర్బన్: ప్రతిష్టాత్మకమైన దాశరథి కృష్ణమాచార్య అవార్డుకు కామారెడ్డికి చెందిన ప్రఖ్యాత కవి, రచయిత, సంస్కృత అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాశరథి అవార్డుకు ఎంపికైనందుకు సీఎం కేసీఆర్ నటేశ్వరశర్మకు అభినందనలు తెలిపారు. ఈనెల 22న రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే దాశరథి జయంతి ఉత్సవాల్లో అవార్డును అందించనున్నారు.

అయాచితం నటేశ్వరశర్మ కామారెడ్డి ప్రాచ్య విద్యా పరిషత్ ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సంస్కృత విభాగాచార్యులుగా, ప్రధానాచార్యులుగా పనిచేసి 2014లో ఉద్యోగ విరమణ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2011 నుంచి 2013 వరకు ప్రాచ్యభాషా విభాగానికి పీఠాధిపతి(డీన్)గా పనిచేశారు. ఆది శంకరాచార్యుల 'సౌందర్య లహరి'పై పరిశోధనకుగాను 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా, స్వర్ణపతకం బహూకరించింది. ఆయన ఆముక్తమాల్యదపై విమర్శ గ్రంథం రాశారు. నటేశ్వరశర్మ రాసిన 'శకుంతల' కావ్యానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కావ్య పురస్కారం దక్కింది. రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో 'తెలంగాణ సుప్రభాతమ్' రాశారు. ఆయన 1981 నుంచి ఇప్పటివరకు సంస్కృతంలో వందకుపైగా అష్టావధానాలు నిర్వహించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులను నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో రఘురాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో మొత్తం 58 పోస్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈ నెల 24 వరకు దరఖాస్తులను తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని తెలిపారు.

ఖాళీల వివరాలు..

నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జువాలజీ, సివిక్స్, హిస్టరీ సబ్జెక్టుల్లో, అలాగే ఉర్దూ మీడియంలో ఇంగ్లిష్, ఉర్దూ, ఫిజిక్స్, బొటని, జువాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. నిజామాబాద్ బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ, మ్యాథ్స్, సివిక్స్, ఉర్దూ మీడియంలో ఫిజిక్స్, జువాలజీ, ఒకేషనల్ అకౌంట్స్ అండ్ టాక్సేషన్ అధ్యాపకుల అవసరం ఉందని పేర్కొన్నారు. భీమ్‌గల్ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్, మ్యాథ్స్, బాల్కొండ కళాశాలలో సివిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఆర్మూర్ బాలికల కళాశాలలో ఫిజిక్స్, కామర్స్, హిస్టరీ, సివిక్స్, హిందీ, ఉర్దూ మీడియంలో ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ధర్పల్లి కళాశాలలో హిందీ, ఎకనామిక్స్, సివిక్స్, కోటగిరి కళాశాల ఉర్దూ మీడియంలో సివిక్స్, ఎకనామిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటని, జువాలజీ, డిచ్‌పల్లి కాలేజీలో హిందీ, ఆర్మూర్ బాలుర కళాశాలలో మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ, మోర్తాడ్ కళాశాలలో కెమిస్ట్రీ, వర్ని కాలేజీలో జువాలజీ, ఎకనామిక్స్, బోధన్ మధుమలాంచ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అలాగే మాక్లూర్ కళాశాలలో కెమిస్ట్రీ, ఒకేషనల్ కంప్యూటర్ సైన్స్, బోధన్ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, ఎకనామిక్స్, హిస్టరీ/సివిక్స్, ఉర్దూ మీడియంలో మ్యాథ్స్, కామర్స్, ఉర్దూ సబ్జెక్టుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ నెల 26న దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని, 27న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామన్నారు. ఒక పీరియడుకు రూ.390 చొప్పున నెలకు గరిష్టంగా 72 పీరియడ్లుతో రూ.28,080 వేతనం ఉంటుందన్నారు.

గిరిరాజ్ కళాశాలలో..

నిజామాబాద్ అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, బీబీఏ, బిజినెస్ అనలిటిక్స్, పొలిటికల్ సైన్స్(ఉర్దూ మీడియం), బీబీఏ(లాజిస్టిక్స్) బీసీఏ. బయో టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, టాక్సేషన్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

ఆర్మూర్‌లో అక్కాచెల్లెళ్ల హత్య

- నగల కోసమే హతమార్చారా!



ఘటన స్థలంలో ఆరా తీస్తున్న ఇన్‌చార్జి సీపీ



రాజవ్వ(ఫైల్)



గంగవ్వ(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో బుధవారం జరిగిన జంట హత్యలతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు. పట్టణంలోని రెండో వార్డు పరిధిలోని జిరాయత్‌నగర్‌లో నివాసముండే రాజవ్వ(72), గంగవ్వ(62) అనే అక్కాచెల్లెళ్లను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. పట్టణానికి చెందిన రాజవ్వ, గంగవ్వ అక్కాచెల్లెళ్లు. రాజవ్వకు 20 ఏళ్ల క్రితం విడాకులు కావడంతో ఒంటరిగా ఉంటుంది. గంగవ్వకు ఇద్దరు కుమారులు శ్రీనివాస్, మహిపాల్ ఉండగా.. శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్‌లో, చిన్న కుమారుడు మహిపాల్ మామిడిపల్లిలో ఉంటున్నారు. గంగవ్వ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందడంతో అనారోగ్యంతో మంచానపడ్డ అక్క రాజవ్వకు సపర్యలు చేసుకుంటూ ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. మహిపాల్ తన తల్లి గంగవ్వకు నిర్మల్ జిల్లా ముదోల్ ఆస్పత్రిలో మంగళవారం నేత్ర పరీక్షలు చేయించుకుని సాయంత్రం ఇంటి వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయమే ఇద్దరు మహిళలు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగులు ఒంటరిగా ఉంటున్న వారి తలలపై ఆయుధాలతో దాడి చేసి హతమార్చారు. అనంతరం హత్యలను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఇంట్లోని దుస్తులకు నిప్పు పెట్టి జారుకున్నారు. ఇంటి నుంచి పొగలు వస్తుండడంతో స్థానికులు గంగవ్వ కుమారుడు మహిపాల్‌కు సమాచారం అందించారు. అనంతరం లోపలికి వెళ్లిన స్థానికులు పొగల మధ్యన మహిళలను వెతుకుతుండగా హత్యకు గురై విగత జీవులుగా పడి ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావు, ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి జాగిలాలను రప్పించి ఆధారాలు సేకరించారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

మహిళలను వారిపై ఉన్న నగల కోసమే హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఇంటి పక్కన కల్లు కాంపౌండ్ ఉండడంతో అక్కడికి వచ్చే వారే ఒంటరిగా ఉంటున్న మహిళలను హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌చార్జీ సీపీ ప్రవీణ్‌కుమార్ హత్యలు జరిగిన తీరును పరిశీలించారు. అన్ని కోణాల్లో విచారించి నేరస్తులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించారు.

కారు బోల్తా పడి ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు



బోల్తా పడిన కారు



సూరజ్ (ఫైల్)

బోధన్‌టౌన్: బోధన్‌లోని బైపాస్ రోడ్డులో బొజ్జ వినాయకుడి ఆలయం సమీపంలో మంగళవారం రాత్రి కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు.. బోధన్‌లోని ఆజంగంజ్ కాలనీకి చెందిన సూరజ్ దాలియా రాహుల్ దాలియా తమ మిత్రుడు యష్‌రాండర్‌తో కలిసి ఆచన్‌పల్లిలో గల దీపక్ స్వీట్ హోంకు వెళ్లారు. అనంతరం యష్ రాండర్‌ను ఇంటి వద్ద వదిలి వేయడానికి ఆచన్‌పల్లి బైపాస్ మీదుగా వెళ్తుండగా గణపతి ఆలయ సమీపంలో కారు అదుపు తప్పి బోల్తా పడింది. సూరజ్ దాలియాకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. గాయపడ్డ మిగతా ఆస్పత్రికి తరలించారు. వీరిలో రాహుల్‌కు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాహుల్ దాలియా తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై పోక్సో కేసు

బోధన్‌టౌన్: బోధన్‌లోని శక్కర్‌నగర్ చౌరస్తాలో బాలికను ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సోహైల్ అనే యువకుడు బాలికను ఏడాదిన్నరగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఎవరు లేని సమయంలో బాలిక ఇంట్లోకి చొరబడ్డ యువకుడిని కుటుంబ సభ్యులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని చెప్పారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా సదరు యువకుడు ఏడాదిన్నరగా వేధిస్తున్నాడని, ఎవరికి చెప్పుకున్నా అండగా నిలువలేదని బాలిక తండ్రి ఓ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

యువతి కిడ్నాప్

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన యువతిని అదే కాలనీకి చెందిన వికార్ కిడ్నాప్ చేసినట్లు ఎస్సై శ్రావణ్ తెలిపారు. యువతిని బలవంతంగా ఎత్తుకెళ్లినట్లు యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కొంతకాలంగా యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్న వికార్ ఈ నెల 14న కాలేజీకి వెళ్తుండగా కిడ్నాప్ చేశాడు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు ఠాణాకు చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో వీరంగం

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని నాగారంలో మనోహర్ అనే యువకుడు మద్యం మత్తులో కత్తితో వీరంగం చేసినట్లు తెలిసింది. కమ్మకత్తి, పారతో మరో యువకుడిపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రెండిళ్లలో చోరీ



సీసీ టీవీలో నమోదైన అనుమానితులు

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లిలో తాళం వేసిన రెండిళ్లలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన మోతె శ్రీనివాస్ రెడ్డి, మెండె సాయిలుకు చెందిన ఇళ్ల తాళాలు పగులగొట్టి శ్రీనివాస్ ఇంటి నుంచి రూ.20 వేల నగదు, పది తులాల వెండి, సాయిలు ఇంట్లో నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేశామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రామారెడ్డి: రామారెడ్డిలో బుధవారం పేకాడుతున్న ఇద్దరిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వారి నుంచి రూ.1500 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో రైతు..



ఫకీర మృతదేహం

ఇందల్వాయి: మండలంలోని మేఘ్యానాయక్ తండాలో లాకవత్ ఫకీర(52) అనే రైతు మంగళవారం ఉదయం తన పొలంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఫకీర తనకున్న రెండున్నర ఎకరాల పొలాన్ని వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసే క్రమంలో బోరుబావి మోటారు స్టార్ట్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైనట్లు చెప్పారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళ..

కమ్మర్‌పల్లి: మండలంలోని హాసాకొత్తూర్‌లో బుధవారం ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన దేవి సావిత్రి(57) తన కొడుకు అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తుండగా, బస్టాండ్ సమీపంలో రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పింది. దీంతో సావిత్రి కింద పడడంతో తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆర్మూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.